


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
శనివారం 19 జులై 2025 పేజీలు 8


## క్వాంటమ్ వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్తు 8


















# బీసీలకు రాజ్యాధికారం ఇచ్చిన ఘనత టీడీపీదే

**రిజర్వేషన్లు.. ఆస్తిలో హక్కు కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్**

**బీసీవర్గాల్లో రాజకీయ చైతన్యం నింపిన ఘనుడు సీఎం చంద్రబాబు**

**బీసీలకు అన్యాయం చేసిన ఘనత జగన్దే : బీసీ చైతన్య సదస్సులో వక్తలు**

**తోట్లవల్లూరు, జూలై 18 మేజర్ న్యూస్ :** అన్నిరంగాలలోను వెనుకబడి ఉన్న బీసీలలో రాజకీయ చైతన్యం రగిలించి స్ఫూర్తి నింపిన గొప్ప నాయకుడు టిడిపి అధినేత, సీఎం చంద్రబాబే అని పలువురు వక్తలు కొనియాడారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో తోట్లవల్లూరులోని టిడిపి కార్యాలయంలో బీసీ చైతన్య సదస్సు నిర్వహించారు. సదస్సుకు రాష్ట్ర గౌడ సంక్షేమ - అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కుమార్ రాజా తోపాటు పలువురు ప్రముఖులు, బీసీ నాయకులు గత ప్రభుత్వ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయంపై సదస్సులో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి బీసీ వర్గాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, సహాయ సహకారాలను, రాజకీయ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని వల్లెవేశారు. బీసీలను ఏవిధంగా ఇబ్బందులకు గురిచేశారో వివరించారు. పెదపారుపూడి మండలం ఈదులమద్దాలికి చెందిన ధాన్యం కమిషన్ వ్యాపారుడు కొండవీటి శ్రీనివాసరావును కొడాలి నాని పిఎ రైస్ మిల్లుకు పిలిచి భయభ్రాంతులకు గురిచేస్తే శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందాడని, టిడిపి నాయకుడికి ఫ్లెక్సీ బ్యానర్ కట్టిన రజక సోదరుడు కనుమూరి



ఈశ్వరరావుపై కొడాలి నాని అనుచరులు బీరు సీసాలతో దాడి చేసారని, గౌతు లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష పై రాష్ట్ర వ్యాప్తంగా అసత్య ఆరోపణలు, ప్రేలాపనలు చేయించడం, అమర్నాథ్ గౌడ్ ను అన్యాయంగా హత్య చేయించిన వైకాపా నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. తాజాగా గుడివాడలో జరిగిన చిన్నపాటి ఘర్షణలో ఓ బీసీ ప్రజాప్రతినిధిపై దాడి జరిగిందని, ఎన్డీఏ కూటమి నాయకులు బీసీలపై దాడులకు పాల్పడ్డారంటూ మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ వర్గాలకు చెందిన శ్రీనివాసరావు, ఈశ్వరరావు, గౌతు లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష, అమర్నాథ్ గౌడ్ కు తీరని అన్యాయం జరిగితే నాడు నోరు విప్పని కఠారి ఈశ్వరకుమార్ నేడు బీసీలపై కపటప్రేమ చూపడం కఠారి ఊసరవెల్లి రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమని మండిపడ్డారు. టీడీపీకి బీసీలే వెన్నెముక అని, టీడీపీ అంటేనే బీసీలని, బీసీలంటేనే టీడీపీ అన్న రీతిలో దివంగత ఎన్టీఆర్, నేటి సీఎం చంద్రబాబు లు బీసీలకు భరోసాగా నిలిచారన్నారు. రాజకీయ నాయకుల పల్లకీలు మోసే వారిగా ఉంటూ వస్తున్న బీసీల్లో రాజకీయ చైతన్యం రగిలించిన స్ఫూర్తిమంతులు ఎన్టీఆర్, చంద్రబాబు అని కొనియాడారు. గత పాలకులు బీసీలను అన్నిరంగాల్లోను నిస్తేజానికి గురిచేస్తే కూటమి ప్రభుత్వం బీసీల రాజకీయ, రాజకీయేతర అభివృద్ధికి బంగారుబాటలు వేస్తోందన్నారు. రాజకీయ, రాజ్యాంగబద్ధ, నామినేటెడ్ పదవుల్లో కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని, బీసీలంతా టీడీపీకి వెన్నుదన్నుగా నిలుస్తుండటంతో ఓర్వలేని మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులు కుటిలరాజకీయాలకు తెరతీస్తున్నారని, వారి కుట్రలు, కుతంత్రాలను బీసీలంతా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, కృష్ణాజిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రామినేని వెంకట బసవ కుటుంబరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వీరంకి పరశురాం, బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు, తోట్లవల్లూరు గ్రామ పార్టీ అధ్యక్షులు గొరిపర్తి గోపయ్య, బిసి సాధికార సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణ, నెక్కలపూడి మురళి తదితర ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొన్నారు.

## ఏసీఎంఈ సోలార్, ఎన్‌హెచ్పీసీతో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ఒప్పందం

**విజయవాడ, జూలై 18, మేజర్ న్యూస్ :** ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్ తమ అనుబంధ సంస్థల ద్వారా ఎన్‌హెచ్పీసీతో మొత్తం 275 మెగావాట్ల (ఎంసీ)/550 మెగావాట్ గంటల సామర్థ్యం గల రెండు స్వతంత్ర బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ (బీఈఎస్ఎస్) ప్రాజెక్టుల కోసం బ్యాటరీ ఎనర్జీ నిల్వ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టులను 2025 జూన్ 24న జరిగిన ఈ-రివర్స్ వేలంలో విజయవంతంగా చేజిక్కించుకుంది. ఇందులో 50 మెగావాట్లు / 100 మెగావాట్ గంటల సామర్థ్యం గల ప్రాజెక్టు కోసం నెలకు మెగావాట్‌కు రూ.2,10,000, 225 మెగావాట్లు / 450 మెగావాట్ గంటల సామర్థ్యం గల మరో ప్రాజెక్టుకు నెలకు మెగావాట్‌కు రూ.2,22,000 టారిఫ్ గా నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులు భారత ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకం కింద ఉన్నాయి. ఈ పథకం ప్రకారం ఒక్కో మెగావాట్ గంటకు రూ.27 లక్షలు లేదా మొత్తం ప్రాజెక్టు ఖర్చులో 30 శాతం.. వీటిలో ఏది తక్కువగా ఉంటే దానిని అందిస్తారు. ఈ ప్రాజెక్టుల కోసం లెటర్ ఆఫ్ అవార్డ్ జూలై 8, 2025న మంజూరైంది. ఈ ఒప్పందానికి ప్రధాన కారణం.. ఆంధ్రప్రదేశ్‌ను ముందుగానే కస్టమర్‌గా గుర్తించడం. స్టాండ్‌అలోన్ బీఈఎస్ఎస్ వ్యవస్థను కస్టమర్ సైట్‌లోనే ఏర్పాటు చేయనున్నందున భూమి, పవర్ ఎవాక్యుయేషన్ మౌలిక సదుపాయాలు కస్టమరే అందించనున్నారు. ఇది ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయనుంది. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేస్తున్న ప్రత్యేకత కలిగిన మొదటి ప్రాజెక్టులుగా నిలవనున్నాయి. సంతకం చేసిన పద్దెనిమిది నెలల వ్యవధిలో పూర్తవుతుంది. తక్కువ డిమాండ్ ఉన్న సమయంలో విద్యుత్‌ను నిల్వ చేస్తాయి, అధిక డిమాండ్ ఉన్న సమయంలో విడుదల చేస్తాయి. సోలార్, విండ్ వంటి మార్పుల ప్రాతిపదికన విద్యుత్ వనరుల సమన్వయాన్ని మెరుగుపరచడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. భారత ఇంధన రంగంలో ఇది ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తోంది. 'బీఈఎస్ఎస్ యాజ్ ఏ సర్వీస్' ఫ్రేమ్‌వర్క్ కింద సామర్థ్య ఛార్జీలు చెల్లించాల్సిన మార్గదర్శక నమూనాను పరిచయం చేస్తాయి.

## శాకాంబరి అలంకరణలో భువనేశ్వరి దేవి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో కొలువై ఉన్న భువనేశ్వరి దేవి అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం రోజున పలు రకాల కూరగాయలతో అలంకరించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా సామూహింగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం శ్రీ లలిత సహస్ర నామ పారాయణములు చేశారు. అర్చక స్వాములు దీవి రఘునాథాచార్యులు, బాలకృష్ణాచార్యులు పాల్గొని భక్తులకు మంత్రపుష్పం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# ఐక్యూ జెడ్10ఆర్ జూలై 24న విడుదల

**విజయవాడ, జూలై 18, మేజర్ న్యూస్ :** పెర్ఫార్మెన్స్‌కు పేరు గాంచిన స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ, జూలై 24న తన కొత్త మోడల్ ఐక్యూ జెడ్10ఆర్ ను విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ ఫోన్‌ను ముఖ్యంగా విద్యార్థులు, కొత్తగా ఎదుగుతున్న కంటెంట్ క్రియేటర్లను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు. ఇది 4కె ఫ్రంట్, రియర్ కెమెరా, అల్ట్రా-స్లిమ్ క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లే,, సెగ్మెంట్‌లో అత్యుత్తమమైన మెడియటెక్ డిమెంసిటీ 7400 ప్రాసెసర్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్, ఎప్పుడూ ఆన్‌లైన్‌లో ఉండే, వేగంగా మారుతూ ఉండే జీవితానికి అనుగుణంగా తయారు చేశారు. కంటెంట్ క్రియేటర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ ఫోన్‌లో, 50ఎంపీ సోనీ ఐఎంఎక్స్882 ఓఐయస్ ప్రధాన కెమెరా,, సెగ్మెంట్‌లో ముందంజలో ఉన్న 32 ఎంపీ 4కె ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. ఫ్రంట్, రియర్ రెండింటిలోను 4కె వీడియో రికార్డింగ్‌ను అనుమతించటం వలన, ప్రొఫెషనల్ స్థాయిలో హెచ్‌డీఆర్ క్వాలిటీ వీడియోలు తీయవచ్చు. ఈ సెగ్మెంట్‌లో 4కె ఎంపీ ఫ్రంట్ కెమెరా కలిగిన ఏకైక ఐక్యూ ఫోన్ ఇదే, కాబట్టి మొబైల్‌లోనే క్రియేట్ చేయాలనుకునే యూత్‌కు ఇది బెస్ట్ అప్‌గ్రేడ్ అవుతుంది. 5700ఎంఎహెచ్ భారీ బ్యాటరీతో రన్నింగ్‌లో ఉన్నవారికి ఇది సరైన ఎంపిక. ఇది వీడియోలు తీయడం, గేమింగ్, ఆన్‌లైన్ క్లాసులు, కంటెంట్ క్రియేషన్ వంటివి చేయడానికి సుదీర్ఘ బ్యాటరీ లైఫ్ అందిస్తుంది. టీఎస్‌యంసీ 4ఎన్ఎం టెక్నాలజీపై నిర్మితమైన మెడియటేక్ డిమెంసిటీ 7400 5జి చిప్‌సెట్, శీఘ్రత, మల్టిటాస్కింగ్, ఎడిటింగ్, స్ట్రీమింగ్ అన్నింటిలోను ల్యాగ్ లేకుండా పనిని కొనసాగిస్తుంది.ఇండియాలోనే అత్యంత స్లిమ్ 120హెచ్‌జెడ్ క్వాడ్ కర్వ్‌డ్ అమోలేడ్ డిస్‌ప్లే ఈ ఫోన్‌కు అద్భుతమైన విజువల్ అనుభవం అందిస్తుంది. ఇంకా ఐపీ68, ఐపీ69 సర్టిఫికేషన్లు ఉండటం వల్ల, ఈ ఫోన్ మట్టికీ, నీటికీ, అధిక ఒత్తిడితో వచ్చే స్ప్రేలకు కూడా రక్షణనిస్తుంది. కాబట్టి, బయట షూటింగ్ చేసే క్రియేటర్లకు ఇది పర్‌ఫెక్ట్. ఫ్యాషన్ పరంగా కూడా జెన్ జెడ్‌లను ఆకర్షించే రెండు స్టైలిష్ కలర్ వేరియంట్లు ఆక్వామెరైన్, మూన్‌స్టోన్‌లలో అందుబాటులో ఉంటుంది.




# హిమాలయ 'భృంగరాజ్' యాంటీ హెయిర్ ఫాల్ షాంపూ




**విజయవాడ, జూలై 18, మేజర్ న్యూస్ :** ప్రతి రోజూ ఎదురయ్యే జుట్టు సమస్యలపై ప్రకృతి ఆధారంగా పరిష్కారం అందించాలన్న ఉద్దేశంతో హిమాలయ వెల్‌నెస్ ఒక కొత్త క్యాంపెయిన్ ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్లో జుట్టు రాలడం తగ్గించడంలో ప్రసిద్ధి చెందిన 'భృంగరాజ్' - 'జుట్టుకు రాజు' అనే పేరుతో ముందుకు వచ్చింది. ఈ క్యాంపెయిన్ కోసం రూపొందించిన కొత్త టీవీ యాడ్ దేశవ్యాప్తంగా డిజిటల్ ప్రచారాల్లో 'భృంగరాజ్'కు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సందర్భంగా హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెటింగ్ డైరెక్టర్ రాగిణి హరిహరన్ మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు హిమాలయ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కొత్త భృంగరాజ్ ప్రచారం హిమాలయపై ఉన్న విశ్వసనీయతను మరింత సమర్ధవంతంగా చాటుతుందన్నారు. జుట్టుకు బలం, పోషణ ఇచ్చే లక్షణాలతో 'భృంగరాజ్' ప్రసిద్ధి చెందినదన్నారు. ఈ ప్రచారం కేవలం జుట్టు రాలే సమస్యకు పరిష్కారం మాత్రమే కాదని, ఒకరి మీద ఒకరికి ఉండే నమ్మకాన్ని, స్నేహితుల మధ్య బంధాన్ని, జుట్టు సంరక్షణ కోసం హిమాలయపై నమ్మకాన్ని సంతోషంగా సెలబ్రేట్ చేయడం అన్నారు. ఈ సందర్భంగా 82.5 కమ్యూనికేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సౌత్ హెడ్ నవీన్ రామన్ మాట్లాడుతూ ఇది అభేద్యమైన స్నేహానికి ప్రతిరూపమన్నారు. ఎప్పుడూ నీకు తోడుగా ఉండే స్నేహితుడు నిన్ను ఎప్పుడూ పడిపోనివ్వడన్నారు. ఈ కథనం జుట్టు రాలే భయానికి సంబంధించి ఉంటుందన్నారు. ఈ ప్రచారంలో ఒక నిజాన్ని ప్రకృతి అందాలతో కలిపి చెప్పే ప్రయత్నం చేశామన్నారు. ఈ యాడ్ తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రసారం కానుందన్నారు. దేశవ్యాప్తంగా డిజిటల్ ఫస్ట్ ప్లాట్‌ఫామ్లలో ప్రచారం చేయనున్నామన్నారు. డిజిటల్ ప్రచారం ఇన్‌ఫ్లూయెన్సర్ భాగస్వామ్యాలు కూడా ఈ ప్రచారానికి తోడుగా ఉండనున్నాయన్నారు. హిమాలయ వెల్‌నెస్ తన వినియోగదారులకు ప్రకృతి ఆధారిత జుట్టు సంరక్షణ పరిష్కారాలు అందించాలన్న నిబద్ధతను మరింత బలపరిచే విధంగా ఈ ప్రచారం రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ ప్రచార చిత్రంలో ఓ మైదానంలో ప్రకృతి అందాల మధ్య సూర్య కాంతిలో ఊయలపై ఊగుతున్న ఇద్దరు చిన్న నాటి స్నేహితుల సన్నివేశంతో ఈ షార్ట్ ఫిల్మ్ ప్రారంభమవుతుంది. ఇందులో 'పడిపోతానేమో' అనే భయాన్ని, జుట్టు రాలిపోతుందనే ఆందోళనతో సున్నితంగా అనుసంధానం చేశారు. ఒక బాలిక ఊగుతున్నప్పుడు తాను పడిపోతానేమోనని భయపడుతుంది. దానికి స్నేహితురాలు ఇది హిమాలయ యాంటీ హెయిర్ ఫాల్ 'భృంగరాజ్' షాంపూ ఇచ్చే భరోసాను ప్రతిబింబిస్తుంది.

## బీసీ నేతను వరించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి

**పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జన్ను శోభనబాబు నియామకం**



పామర్రు జులై 18 మేజర్ న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన పామర్రు లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు జన్ను శోభన్ బాబు నియమితులయ్యారు. ఈ మేర కు రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులను జారీ చేసింది. పామర్రు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్వంత నియోజకవర్గం. ఇక్కడ నుంచి ఆ పార్టీ పొలిట్ బ్యూరో నేత వర్ల రామయ్య తనయుడు వర్ల కుమార్ రాజా గత ఎన్నికలలో రికార్డ్ మెజారిటీ తో శాసనసభ్యునిగా ఎన్నిక య్యారు. కుమార్ రాజా ఆశీస్సులతో మండలం లోని జుజ్జువరం గ్రామ బిసి (గౌడ) సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత జన్ను శోభనబాబు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. జన్ను శోభనబాబు 1988 – 1991 మధ్య జుజ్జువరం గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ గా,1995 – 2001 మధ్య జుజ్జువరం గ్రామసర్పంచ్ గా 1995 – 2014 గ్రామ టీడీపీ అధ్యక్షులుగా, 2005–2019 మధ్య జుజ్జువరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా, 2015నుంచి ఇప్పటి వరకు టీడీపీ బిసి రాష్ట్ర కార్యదర్శిగా సేవలు అందించారు. రైతుగా, ప్రజా ప్రతినిధిగా, తెలుగుదేశం పార్టీ నాయకునిగా జన్ను శోభన్ బాబు చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి లభించడం పట్ల పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభినందనలు తెలిపారు.

## తెలుగుదేశం పార్టీ బీసీ వర్గాల పార్టీ

**అందుకు నిదర్శనమే జన్ను శోభన్ బాబుకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి...**

**పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**



పామర్రు జులై 18 మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని అందుకు ఉదాహరణగా, వెనుకబడిన తరగతులకు చెందిన జన్ను శోభన్ బాబును మార్కెట్ కమిటీ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన శోభన్ బాబు శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కుమార్ రాజాను కలిశారు. ఈ సందర్భంగా తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను శోభన్ బాబు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పట్ల అంకితభావంతో కృషిచేసిన నాయకుడు శోభన్ బాబు అని పేర్కొన్నారు. గతంలో 2014లో తన తండ్రి వర్ల రామయ్య ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సమయంలోనే శోభన్ బాబుకు మార్కెట్ కమిటీ ఇస్తామని హామీ ఇచ్చారని, అనుకోని పరిస్థితులలో ఆయన ఓడిపోవడంతో అది నెరవేరలేదన్నారు. తిరిగి రామయ్య కుమారునిగా తాను ఈ నియోజకవర్గంలో విజయం సాధించాక తన తండ్రి ఇచ్చిన మాటను తాను నిలబెట్టుకున్నట్లు అయిందన్నారు. ఎంతో అనుభవం కలిగిన శోభన్ బాబు నేతృత్వంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పురోగతిలో పయనిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుండి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని ఆక్రమంలోనే బీసీ వర్గానికి చెందిన శోభన్ బాబుకు పదవి రావడం పట్ల నియోజకవర్గంలోని బీసీ వర్గాల ప్రజలు హర్షవర్షం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను పంపించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి శోభన్ బాబు నియామకం ఉత్తర్వులను అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా కుమార్ రాజా కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ చైర్మన్ గా నియమితులైన శోభన్ బాబును ఎమ్మెల్యే కుమార్ రాజా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పామర్రు టౌన్ పార్టీ అధ్యక్షులు పరసా సుబ్రహ్మణ్యం, ఆ పార్టీ నాయకులు చాట్ల రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, కేదరాశిపల్లి శ్రీను, రామాంజనేయులు, సందీప్ తదితరులు పాల్గొని శోభన్ బాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, మేజర్ న్యూస్ : జాతీయ స్థాయిలో 2026 సంవత్సరానికి గాను "ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్"ను పొందేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్. రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. క్రీడలు, శౌర్యం, సామాజిక సేవ, సైన్సు & టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన బాలలకు "ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్" కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. కావున ఆసక్తిగల బాలలు 31.7.2025 లోగా https://awards.gov.inవెబ్ సైట్‌లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రెవెన్యూ రాబడి పెరిగేలా కృషి చేయాలి

**అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేసి ఆదర్శంగా ఉండాలి**

**ఏళ్ళ తరబడి పనిచేసిన అనుభవంతో శాఖ ప్రగతికి తోడ్పడాలి**

**ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్**






విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : మన రాష్ట్రంలో పనిచేస్తున్న వాణిజ్య పన్నుల శాఖఅధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని వారు పనితీరులో ఎవ్వరికీ తీసిపోరని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శుక్రవారం తాడేపల్లి లోని రాష్ట్ర వాణిజ్య పన్నుల సంస్థ కార్యాలయంలో జేసీ, డీసీ (జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ లు) లతో ఏర్పాటు చేసిన రెవెన్యూ వర్క్ షాపు కార్యక్రమానికి ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ తమ అనుభవాన్ని ఉపయోగించి సంస్థ మరింత పురోభివృద్ధి చెంది ఆదాయాన్ని ఆర్జించేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత మనందరి పై ఉందని మంత్రి అన్నారు. అధికారులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వ్యాపారాలు చేసుకొనే ఏ ఒక్కరికీ ఇబ్బందులు కలగకుండా జీఎస్టీ పన్నుల రెవెన్యూను పెంచాలన్నారు. ఇందులో ఏ ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ పరంగా అధికారులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రభుత్వానికి రాష్ట్రంలో పెట్టుబడులు ఎంతముఖ్యమో అదే విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కూడా అంతే ముఖ్యమన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈఏడాది పన్నుల వసూళ్లలో వృద్ధి సాధించామని ఇందుకు టీమ్ గా పనిచేసిన సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి అయ్యిందని ఇంకా మరింత బాధ్యతాయుతంగా అధికారులు, సిబ్బంది పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నెలలోపు శాఖ ప్రగతిలో మార్పులు తప్పనిసరిగా కనిపించాలన్నారు. మన డాటాని ఆధారం చేసుకుని వ్యవస్థలో లోపాలతో పన్నులను ఎగ్గొట్టేవారికి మనం అంటే చూపించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. అదే స్ఫూర్తిని తీసుకుని నేను కూడా ఎంతో ఇష్టంగా పనిచేస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు కూడా సమర్థవంతంగా తమ సేవలను రాష్ట్రాభివృద్ధి కోసం ఉపయోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాల యాక్షన్ ప్లాన్ తో ముందుకు వెళ్లుతుందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రంలోకి అక్రమంగా వచ్చే ఆయిల్ తదితర దిగుమతులు చేసుకునే వాళ్లు పన్ను వసూళ్లు నుంచి తప్పించుకోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వాటిని సమర్థవంతంగా అరికట్టాలన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్స్ ను సమర్థవంతంగా అరికట్టే విధంగా ఇతర శాఖలతో కలసి జాయింట్ కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసుకుని సంయుక్తంగా తనిఖీలతో వాటిని సరిచేయాలన్నారు. ఫీల్డ్ లో సమర్థవంతంగా పనిచేసినప్పుడే మనం ఆశించిన రిజల్ట్స్ వస్తాయన్నారు. గత ప్రభుత్వం విధానాల వల్ల ఆర్థిక ఇబ్బందులు మన ప్రభుత్వానికి అందించిందని, వాటిని సరిచేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వ్యాట్ పన్నులు పెంచేందుకు పనిచేసిన వారికి అవార్డులు అందిస్తామని మంత్రి తెలిపారు. యానాం నుంచి మన రాష్ట్రానికి డీజిల్ దిగుమతి అవుతుందనే సమాచారం ఉందని అలాంటి వాటిపై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అధికారులకు సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పెండింగ్ రెవెన్యూ వసూళ్లను వసూలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సిస్టమ్ లో ఉన్న లోపాలను ఉపయోగించుకుని పన్ను ఎగ్గొట్టే వారిని నుంచి పన్ను వసూలు చేస్తే రెవెన్యూ పెరుగుతుందన్నారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ మాట్లాడుతూ అధికారులు క్లోజ్ గా మోనటరింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. జీఎస్టీ ఫైలింగ్ అప్పుడు చేసిన డేటా మనకు ఉపయోగపడుతుందన్నారు. అధికారుల అనుభవం శాఖ రెవెన్యూ పెరిగేలా ఉపయోగపడుతుందన్నారు. దేశంలో వేరే రాష్ట్రాలతో పోల్చుకుంటే మన వాణిజ్య పన్నుల శాఖ పనితీరు చాలా మెరుగ్గా ఉందన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చాలా స్మార్ట్ గా పనిచేయాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి రెవెన్యూ రాబడులు పెరగాల్సి ఉందన్నారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సమాచారం, ఆన్ లైన్ సమాచారాన్ని ఉపయోగించుకుని రెవెన్యూ రాబడులను పెంచడం జరిగిందన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రెవెన్యూ వసూళ్లు బాగా పెరిగాయన్నారు. ఇది టీమ్ వర్క్‌గా సిబ్బంది అందరూ పనిచేయడం వల్లే సాధ్యపడిందన్నారు. ఏరోజుకారోజు ప్రత్యేక కార్యాచరణతో, పనితీరు సూచికలతో రెవెన్యూ రాబడి పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వాణిజ్య పన్నుల శాఖ యొక్క అవిశ్రాంత, వినూత్న ప్రయత్నాల కారణంగా జూన్ 2025 లో నికర జీఎస్టీ వసూళ్లలో 7.10% వృద్ధిని సాధించిందని బాబు ఏ తెలిపారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్, కార్యదర్శి రవి శంకర్, రాష్ట్ర పన్నుల ప్రత్యేక కార్యదర్శి సౌమ్య నూతలపాటి, రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డి. రమేష్, రాష్ట్రంలో ఉన్న వాణిజ్య పన్నుల శాఖకు చెందిన జాయింట్ కమిషనర్లు (జేసీ), డిప్యూటీ కమిషనర్లు (డీసీ) లు, తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారి అనుగ్రహం, సీఎం చంద్రబాబు కృషితో**

# రాష్ట్రం సుభిక్షంగా వుంది

**అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్**



ఇంద్రకీలాద్రి మేజర్ న్యూస్: ఇంద్రకీలాద్రి పై అమ్మవారి ఆశీస్సులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి వల్లే రాష్ట్రం పురోగాభివృద్ధి దిశగా పయనిస్తూ ప్రజలందరూ సంతోషంగా వున్నారని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. ఇంద్రకీలాద్రి కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం దర్శించుకున్నారు. కేంద్రమంత్రి, ఎంపీలకు ఆలయ అధికారులు మేళ తాళములతో ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి వారికి తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటం, పట్టు వస్త్రములు అందజేశారు. అమ్మవారి అనుగ్రహం, సీఎం చంద్రబాబు సంకల్పం అమరావతి రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారి కరుణా కటాక్షాలు వుండేలని వేడుకున్నట్లు ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

**ఆలయంలో సంగీత దర్శకుడు ఎస్.ఎస్.థమన్**



ఇంద్రకీలాద్రి పై అమ్మవారి దర్శనం కోసం విచ్చేసిన సంగీత దర్శకుడు ఎస్.ఎస్.థమన్ కు కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ లు తారసపడ్డారు. దీంతో థమన్ వారి వద్దకు వచ్చి పలకరించారు. ఆలయ ప్రాంగణంలో ఈ ముగ్గురు సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు.



## బాధిత కుటుంబాలకు 'మైత్రి' చేయూత

మచిలీపట్నం మేజర్ న్యూస్ : నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కాసాని లక్ష్మీకాంతరావు (51) గత కొంత కాలంగా వెన్నుముక సమస్యతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకొని, ప్రస్తుతం మంచానికే పరిమితమైనారు. కుటుంబ యజమాని మంచాన పడడంతో మందులకు, ఇల్లు గడవక ఆ కుటుంబం నానా ఇబ్బందులు పడుతున్నది. మైత్రి ఫౌండేషన్ సభ్యుల దృష్టికి వారు పడుతున్న సమస్యను తెలియజేయగా వివరాలు సేకరించి ఆ కుటుంబానికి 'మైత్రి' ఆపన్న హస్తం అందించింది. శుక్రవారం ఆ పేద కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ ద్వారా 10,000 /- రూపాయల నగదు సాయం అందించడం జరిగింది. స్థానిక కాలేఖాన్ పేట శివగంగ కు చెందిన 14 సంవత్సరాల విజయకుమార్ అనే బాలుడు గొంతు దగ్గర కణితి (పుండు) సంబంధిత వ్యాధితో బాధపడుతూ దాతల సహకారంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. తదుపరి మరల వైద్యం కోసం వెళ్లడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ ఉండటం గమనించిన మైత్రి సభ్యులు వారికి కూడా తమ ఫౌండేషన్ ద్వారా 10,000/- రూపాయలు వైద్యఖర్చుల నిమిత్తం అందజేయడం జరిగింది.ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణు కుమార్ మైత్రి కుటుంబం ఈ కార్యక్రమంలో పాల్గొంది.

# యానాదుల పిల్లలకు విద్య అందిద్దాము...


## గంజాయి, మత్తు పదార్థాలు వలన యువత పక్కదారి పడుతున్నారు : సీనియర్ న్యాయవాది లంకెశెట్టి బాలాజీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యానాదుల పిల్లలకు విద్య అందిద్దామని, వారిని సంస్కారవంతులుగా విద్యావంతులుగా తీర్చిదిద్దడం మన లక్ష్యమని, సీనియర్ న్యాయవాది లంకెశెట్టి బాలాజీ అన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక జి.పి.ఆర్. ధర్మశాల ఆధ్వర్యంలో మల్కా పట్నం ఎస్టీ కాలనీలో 300 మంది పేద కుటుంబాలకు చెందిన స్త్రీ, పురుషులకు చీరలు, లుంగీలను పంపిణీ చేశారు. నిర్వాహకులు గౌరిపర్తి శ్రీధర్, నూరి(ఖాన్) దివంగత బాజీ కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, జనసేన పార్టీ నాయకులు మాదివాడ రాము తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నడకుదుటి అర్జున, కుంభం రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. బాలాజీ మాట్లాడుతూ ఎస్టీ కాలనీలోని బాల బాలికలంతా, బడికి వెళ్లి చదువుకుని ఎదగాలని, పిల్లలు చదువు లేకపోవడం వలన ప్రభుత్వపరంగా అన్ని శాఖలలో ఎస్టీ పోస్టులు బ్యాక్ లాగ్ పోస్టులతో ఖాళీగా ఉన్నాయని అన్నారు. గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉంచాలని ఆయన సూచించారు. మచిలీపట్నం గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దటంలో అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వలన యువత పక్కదారి పడుతుందని సమాజంలో నేరాల సంఖ్య పెరుగుతోందని బాలాజీ అన్నారు. తల్లిదండ్రులు చెడు వ్యసనాలకు స్వస్తి పలికి పిల్లలను మంచి మార్గంలో పెంచాలన్నారు. యానాదులు కాలనీ అభివృద్ధికి అధికారులు చిత్త శుద్ధితో పనిచేయాలని, ప్రభుత్వ పథకాలన్నీ వారికి అందే విధంగా కృషి చేయాలని బాలాజీ అన్నారు. అవనిగడ్డ ఫైర్ స్టేషన్ అధికారి సుధాకర్ ఇద్దరు యానాది పిల్లలను దత్తత తీసుకుని వారిని డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివించడం అభినందనీయమన్నారు. జనసేన పార్టీ నాయకులు మాదివాడ రాము, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నడకుదిటి అర్జున, జిపిఆర్ ధర్మశాల సేవలు అభినందనీయమని అన్నారు. మానవసేవే మాధవసేవ అనే విధంగా ధర్మశాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్టీ సంఘ నాయకులు కంభం రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తోట్లవల్లూరులో ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**తోట్లవల్లూరు జూలై 18 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన తోట్లవల్లూరులో నూతనంగా ఏర్పాటు చేసిన మూడు విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ లోవల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న గత ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం పట్టించుకోకలేదని దీంతో ప్రజలు ఇబ్బందులు గురయ్యారని తెలిపారు తమ ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే 25 లక్షల రూపాయలకు పైగా వెచ్చించి మూడు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలకు మంచి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకు వచ్చారని తాను అధికారులతో మాట్లాడి అంచనాల రూపొందించి వెంటనే వీటిని ఏర్పాటు చేయించడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలు తీరుస్తూ వారి కష్టసుఖాలలో పాలకొంచెం పాలుపంచుకున్నప్పుడే నిజమైన నాయకుడు అవుతారని ఆయన పేర్కొన్నారు అధికారంలో ఉన్నాం కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలు తీర్చకపోతే మరోసారి ప్రజలు ఛీ కొడతారు అనే విషయాన్ని గమనించాలని కోరారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా రాక్షస పాలన సాగడం వల్లే గత ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టి తమ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు తాము ప్రజల మనిషిగా ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలోని బీసీ కాలనీ బేబీ సెంటర్ ఉప్పరపేట రజక పేట ప్రాంతాలకు ఈ మూడు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం వల్ల మెరుగైన విద్యుత్ సౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు నెక్కలపు మురళి, రామినేని వెంకట బసవ కుటుంబరావు, రాంబాబు, జనసేన నాయకులు తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 11న వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం వెంటనే నిర్వహించాలి

## 45వ డివిజన్ ఇంచార్జి ఫణి కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం కన్వెన్షన్ హాల్, మ్యూజియం నిర్మాణానికి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలో పెట్టి హైకోర్టు వారి ఉత్తర్వులను అధికారులు, వైసిపి కార్పొరేటర్లు, మేయర్ గౌరవించారని, ప్రజలందరూ దీనికి హర్షం వ్యక్తం చేసారని, దురదృష్టవశాత్తు ఆరోజు ఒక మాజీ కౌన్సిలర్ చనిపోవుటచే కౌన్సిల్ సమావేశం మాజీ కౌన్సిలర్‌కు సంతాపం తెలుపుతూ వాయిదా వేయడం జరిగిందని 45వ డివిజన్ ఇంచార్జి పివి ఫణి కుమార్ అన్నారు. మాజీ కౌన్సిలర్ కు సముచిత స్థానం కల్పించి కౌన్సిల్ సమావేశం వాయిదా వేయడం సబబే, కానీ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసిన తర్వాత వెంటనే తదుపరి కౌన్సిలింగ్ నిర్వహించే తేదీ వెంటనే తెలియజేస్తే బాగుండేదని, మాజీ ఎల్ఐసి కోపరేటివ్ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షుడు వేము కోటేశ్వర రావు, పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి, పి. వి. ఫణి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మున్సిపల్ కార్పొరేషన్ లో అధికార వైసిపి పాలకవర్గం మరల కౌన్సిల్ సమావేశం నిర్వహించనందుకు నిరసనగా పట్టాభి స్మారక భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలం ఎదుట కౌన్సిల్ ఎజెండా కాపీ చూపుతూ, శుక్రవారం నిరసన వ్యక్తం చేసారు. వివిధ కారణాలతో వాయిదా పడ్డ కౌన్సిల్ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నగర కార్పొరేషన్ లోని అధికారులు, పాలకవర్గం, పట్టాభి స్మారక భవన నిర్మాణ అంశాన్ని పరిగణన లోకి తీసుకొని వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఆళ్ళ మాధవ, కొనకళ్ల అరుణ్ కుమార్, ఎస్. కోటేశ్వరరావు, జన్ను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి

## డిఆర్ఓ.. కే చంద్రశేఖరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ కే చంద్రశేఖర రావు అధికారులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ మీటింగ్ హాల్‌లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహించి పలువురు ఉద్యోగుల నుండి వినతులను తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెల 3వ శుక్రవారం ఉద్యోగల సమస్యలను పరిష్కరించేందుకు ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుందని డిఆర్ఓ తెలిపారు.

## స్థాయి సంఘ సమావేశాలు వాయిదా



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జరగవలసిన స్థాయి సంఘ సమావేశాలకు జిల్లాలోని జడ్పిటిసి సభ్యులు ఎవరు హాజరుకానందున సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో కన్నమనాయుడు ప్రకటించారు. శుక్రవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆయన డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్ తో కలసి స్థాయి సంఘ సమావేశాలను ప్రారంభించారు. అయితే ఈ సమావేశాలకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు హాజరైనప్పటికీ జడ్పిటిసి సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో షెడ్యూల్లో ప్రకటించిన సమయం ప్రకారం వేచి చూసి ఒక్కొక్క స్థాయి సంఘ సమావేశం వాయిదా వేస్తూ ప్రకటించుకుంటూ వచ్చారు. తొలిగా, రెండవ స్థాయి సంఘ సమావేశం గ్రామీణాభివృద్ధి, మూడవది వ్యవసాయం, నాలుగవది విద్య వైద్యం, ఆరవదిగా స్త్రీ సంక్షేమం, రక్షణ సమావేశ నిర్వహణ కోసం నిరీక్షించి సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో భోజనం విరామం ప్రకటించారు. విరామం అనంతరం జెడ్పి సీఈవో ఆరవ స్థాయి సంఘ సమావేశం సాంఘిక సంక్షేమంను ప్రారంభించగా పెడన జడ్పిటిసి సభ్యులు అర్జా వెంకట నగేష్ మాత్రమే హాజరయ్యారు. అయితే సమావేశ నిర్వహణకు నిబంధనల ప్రకారం చాలినంత కోరం లేనందున వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి 1వ స్థాయి సంఘ సమావేశం ప్లానింగ్ ఆర్థికం, ఏడవదిగా పనులు స్థాయి సంఘ సమావేశానికి సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి, తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామని జెడ్పి సీఈవో తెలిపారు.

## కొండిపర్రు రహదారిపై నిలిచిన నీరు - ప్రజల అవస్థలు





**పామర్రు జులై 18 మేజర్ న్యూస్ :** పామర్రు మండలంలో కురిసిన భారీ వర్షానికి కొండిపర్రు రోడ్డు నీటితో నిండి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పామర్రు నుండి కొండిపర్రు పోవు రహదారి వర్షం లేనప్పుడు డ్రైనేజీ నీటితో ప్రజలు ఇబ్బంది పడుతుండగా గత రాత్రి కురిసిన వర్షంతో వారి ఇబ్బందులు మరింత తీవ్రతరమయ్యాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారిపై నీరు నిలవకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. పామర్రు - గుడివాడ ప్రధాన రహదారి పక్కనే ఉన్న డ్రైన్ సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే తమకు ఈ దుస్థితి కలుగుతోందని, రోడ్డుపై నీళ్లు నిలవకుండా డ్రైన్ లోనికి మార్గం ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

## ఎమ్మెల్యే వసంతకి ప్రజా ప్రెస్ క్లబ్ సన్మానం

**నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం**



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ని ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు సన్మానించారు. గొల్లపూడి లోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అంద జేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్ర సాదు ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసే కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ని ప్రజా ప్రెస్ క్లబ్ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టి కి ప్రెస్ క్లబ్ సభ్యులు పలు సమస్యలు తీసుకువెళ్లారు. ఇబ్రహీంపట్నంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టు లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరడంతో సానుకూలంగా స్పందించారు. తన సంపూర్ణ మద్దతు ఎప్పుడు ఉంటుందని మీకు ఉంటుందని తెలిపారు. ఎమ్మె ల్యే కృష్ణప్రసాదుని కలిసిన వారిలో ప్రజా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు అడపా శివ, చల్లా రవీంద్ర, కోశాధికారి క్రొముది, ఉపాధ్యక్షులు రాఘవులు, సహాయ కార్యదర్శి దాసి ప్రతాప్, సభ్యులు పల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ సభ్యులను మైలవరం శాసనసభ్యులు వసం త వెంకట కృష్ణప్రసాదు అభినందించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ని జి.కొండూరు పిఏసిఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పజ్జూరు శ్రీనివాసరావు, సభ్యులు చందా మరియమ్మ, అత్తి సుమలత, స్థానిక నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాదు మాట్లాడుతూ రైతులకు సొసైటీ నుంచి విస్తృతంగా సేవలను అందించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంఘ సభ్యుల సంక్షేమానికి కృషిచేయాలన్నారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు



**కంచికచర్ల జూలై 18 మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ప్రయాణించేందుకు వీలు లేకుండా అధ్వానంగా తయారయింది. నిత్యం ప్రభుత్వాసుపత్రికి వైద్య సేవలు కొరకు వచ్చే బాధితులు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రధాన రహదారి గుండా, గొట్టుముక్కల రోడ్డు నుండి నిత్యం రాకపోకలు జరుగుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు గోతులు మయంగా తయారై రోగులకు, ప్రయాణికులకు ప్రాణ సంఘటనగా మారింది.నాయకులు, అధికారులు ఈ రహదారి గురించి తెలిసినప్పటికీని ఏమీ పట్టనట్లు వ్యవహరించటం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గొట్టుముక్కల గ్రామానికి ఈ రహదారి స్వల్ప దూరం కావడంతో గ్రామస్తులు ఎక్కువగా ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు,బాలింతలు, ఇతర రోగులు ఇబ్బందులు పడకుండా రహదారిని తక్షణమే మరమ్మతులు జరిపించాలని పలువురు కోరుతున్నారు.

## గుండెపోటుతో ఘంటసాల వీఆర్ఏ బిక్షం మృతి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల వీఆర్ఏగా పని చేస్తున్న పాతపాటి బిక్షం (64) గుండెపోటుతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘంటసాల అంబేద్కర్ నగర్ కు చెందిన వీఆర్ఏ బిక్షం మృతి చెందిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, రెవిన్యూ ఉద్యోగులు, సిబ్బంది బిక్షం భౌతికకాయన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి చెందిన బిక్షంకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

### అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం కోసం

# 6.8 ఎకరాల కేటాయింపు హర్షదాయకం



**ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కృతజ్ఞతలు.**

**నందిగామ, జూలై 18, మేజర్ న్యూస్:** రాష్ట్ర రాజధాని అమరావతిలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం స్థాపన కోసం 6.8 ఎకరాల భూమిని కేటాయించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి నందిగామ శాసనసభ్యురాలు, ఏపీ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆర్యవైశ్య సంఘాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు వివిధ ఆర్యవైశ్య సంఘాలతో కలిసి కాకాని నగర్ వారి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వ హించారు ఈ నిర్ణయం ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు పొట్టి శ్రీరాములు త్యాగాన్ని స్మరించుకునేందుకు, ఆయన స్ఫూర్తిని భావితరాలకు చేర్చేందుకు ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచింది.అమరావతిలోని శాఖమూరు పార్కులో 6.8 ఎకరాల భూమిని అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు కేటా యిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీని నెరవేర్చినట్లయింది. ఈ స్మృతి వనంలో 58 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహం, ల్యాండ్‌స్కేప్ గార్డెన్స్, విద్యా ప్రదర్శనలు,, సందర్శకుల సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ 2026 మార్చి నాటికి పూర్తి కానుందని అధికారులు తెలిపారు. తంగిరాల సౌమ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్ష ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన చారిత్రక సంఘటనను గుర్తు చేశారు. "ఆయన త్యాగం తెలుగు జాతి చరిత్రలో ఒక అమరమైన అధ్యాయం. ఈ స్మృతి వనం ఆయన స్ఫూర్తిని రాబోయే తరాలకు చేర్చేందుకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది," అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘాలు కూడా సంతోషం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతించాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రి పొంగూరు నారాయణ ఈ భూమి కేటాయింపు పత్రాలను ట్రస్ట్ కు అందజేశారు. ఈ కార్యక్రమం అమరావతి రాజధాని నగరంలో సాంస్కృతిక, చారిత్రక విలువల ను ప్రతిబింబించే దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు.తంగిరాల సౌమ్య "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. అమరావతిని ఒక ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే దిశలో ఈ చర్య ఒక మైలురాయి," అని పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘాలతో కలిసి ఈ కృతజ్ఞతలు తెలియజేయడం ద్వారా, సమాజంలోని వివిధ వర్గాల మధ్య సామరస్యాన్ని, ఐక్యతను ప్రోత్సహించేందుకు తమ కట్టుబాట్లను సౌమ్య చాటిచెప్పారు. ఈ స్మృతి వనం ఏర్పాటు కేవలం ఒక స్మారకం మాత్రమే కాకుండా, పొట్టి శ్రీరాములు ఆదర్శాలను, త్యాగ నిరతిని యువతకు స్ఫూర్తిగా నిలిపే ఒక సజీవ కేంద్రంగా రూపొందనుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు, ఆర్యవైశ్య సంఘం తదితరులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాలకు ఆర్డీఓ బాలకృష్ణ ఆకస్మిక తనిఖీ

**నందిగామ, జూలై 18, మేజర్ న్యూస్:** రెవిన్యూ డివిజనల్ అధికారి కె. బాలకృష్ణ నందిగామ పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రైతులకు అత్యవసరమైన ఎరువుల లభ్యత, ధరలు, నిల్వలపై సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని,ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి అమ్మినా తగిన చర్యలు తీసుకుంటామని, రైతులు యూరియా కొనడానికి వస్తే వేరే ఎరువులు తీసుకుంటే యూరియా ఇస్తామని చెప్పే దుకాణాలపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రోజు ధరల బోర్డును బహిరంగ ప్రదర్శన చేయాలి,రైతులు నానో యూరియాను వాడేలా అధికారులు, డీలర్లు ప్రోత్సహించాలి అని ఆదేశం చారు. ఈ తనిఖీలో నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకులు నందిగామ తహసీల్దార్ పాల్గొన్నారు.

## మానవతా సంస్థ వితరణతో మహిళకు కృత్రిమ కాలు అమరిక




**గన్నవరం, జూలై 18, మేజర్ న్యూస్ :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ–గన్నవరం యూనిట్ ఆర్థిక సహకారముతో గన్నవరంకు చెందిన కొనకళ్ళ రామతులసికి కృత్రిమ కాలు అందచేసినట్లు హీల్ సంస్థ సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని, తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, గన్నవరం మానవతా యూనిట్ అధ్యక్షు లు వీసం ప్రసాదరావు చేతుల మీదుగా కృత్రిమ కాలును అందచేశారు. ఈ కార్యక్రమం లో మానవతా – గన్నవరం యూనిట్ చైర్మన్ మదుపల్లి బాలకృష్ణ మూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద రావు, కార్యదర్శి వడ్లమన్నాటి వెంకటకృష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేసిన న్యాయవాదులు



**నందిగామ, జూలై 18, మేజర్ న్యూస్:** హైకోర్టు న్యాయమూర్తి పైఅసభ్యక రమైన మెసేజ్ లు పెట్టటం,, న్యాయవాదులపై జరుగుచున్న దాడులకు అవమానాలకు నిరసనగా నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో కోర్టు విధులను న్యాయవాదులు బహిష్కరించి నిరసన వ్యక్తం వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడు తూ రాజ్యాంగాన్ని పరిరక్షించే న్యాయమూర్తి పైఇటువంటి అసభ్యకరమైన మెసేజ్లు పెట్టడం చాలా బాధాకరమని అటువంటి వారి పట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఇటీవల కాలంలో న్యాయవాదులపై అనే కమైన దాడులు జరుగుతున్నాయి అందులో భాగంగా ఇటీవల ముగ్గురు న్యాయవాదులపై దాడులు జరగటం న్యాయవాదులను చులకన భావంతో మాట్లాడటం చాలా బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకో వాలని, అందులో భాగంగా అడ్వకేట్ ప్రొటెక్ట్ యాక్ట్ ను ప్రవేశపెట్టి న్యాయవా దులకు రక్షణ కల్పించవలసినదిగా ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమం లో బార్ ట్రెజరర్ మాదుగుల స్టాలిన్ బాబు, సీనియర్ న్యాయవాదులుమన్నెం నారాయణరావు, ఏడుకొండలు, కొమ్మినేని మౌలేశ్వరావు, గుడిసె సుమన్, కస్తల నూతన ప్రసాద్, యరగొర్ల రామారావు, ఆనంద్ విజయభాస్కర్, గోపయ్య స్వామి, దున్న అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకొండలమ్మకు మచిలీపట్నం మహిళల ఆషాఢ సారె



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 18 :** కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుచున్న ఆషాఢ మాస మహోత్సవములలో భాగంగా మచిలీపట్నం బలరాముని పేట మూడు స్తంభాల సెంటర్ మహిళలు శ్రీ అమ్మవారికి ఆషాఢ సారె శుక్రవారం సమర్పించారు. వారిని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, సిబ్బంది ఆహ్వానించి తదుపరి దేవస్థానం ముఖ్య అర్చక స్వామి శివ సంతోష్ శర్మ శ్రీ అమ్మ వారికి పూజా కార్యక్రమములు జరిపి అనంతరం తీర్థ ప్రసాదములు అందచేసారు.

# సామరస్యంగా మాట్లాడుదాం రమ్మని పిలిచి దాడులు చేస్తారా....?

## ఆర్థిక లావాదేవీలతో కుటుంబాలను చిన్నా భిన్నం చేస్తారా...?





**జగ్గయ్యపేట,జూలై 18,మేజర్ న్యూస్ :** ఎంతో మంచితనంగా ఇంటికి రమ్మని చెప్పి దాడులు చేయటం సబబేనా,పైగా గూండాలను రౌడీలను తీసుకువచ్చామని మాపైనే నిందలు వేస్తున్నారు అని చల్లదుర్గా వైకుంఠ రావు వాపోయారు. సమాజంలో గౌరవప్రదమైన వ్యక్తిగా,నా పిల్లలను ఉన్నత చదువులు చదువులు చదివించి ఉన్నతలుగా తీర్చిదిద్దాను. నేడు వారు సమాజంలో గౌరవప్రదమైన ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. సంస్కృతి సాంప్రదాయాలను నేర్పాను గాని ఇలాంటి విష సంస్కృతిని నేర్పలేదని ఆయన పాత్రికేయులకు తెలిపారు.గురువారం జరిగిన ప్రెస్ మీట్ లో రాజ్యలత తప్పుడు ప్రచారం చేశారు.20 లక్షల విషయం మాట్లాడదామంటూ మమ్మల్ని పిలవనంపి.వారు దీనిపై మళ్లీ మాట్లాడదాంఅని మీరు 10 మంది రండి అని చెప్పి నారు.30 మంది వచ్చి ఉద్దేశపూర్వకంగా కుట్ర పూర్వకంగా మా కుటుంబంపై రాజ్యలత కుటుంబ సభ్యులు వాళ్ళ మేనమామలు దాడి చేసినారు. ఆ గొడవలో చల్లా వైకుంఠ రావు ఎడమ చేతి 3 వేళ్ళు విరుగగొట్టినారు.అలాగే నా కుమారుడు చల్లా నరేంద్ర చాతి పైన తలపైన రాడ్డుతో కర్రలతో కొట్టారు. దీనితో స్పృహ కోల్పోయిన నా కుమారుడుని హుటా హుటీగా హాస్పటల్ కు తరలించడం జరిగినది. చల్లాదుర్గ ఎడమ భుజము పైన రాళ్లతో దాడి చేసినారు. సామరస్యంగా మాట్లాడదాం అని పిలిపించి. కావాలని పగడ్బందీతో పక్కా ప్రణాళికతోప్లాన్ చేసి కావాలని మా కుటుంబ సభ్యులందరినీ గాయపరిచి దాడులు చేశారు. నా కుమారుడు నాకు తెలియకుండా వాళ్ళ అత్త మామలు భార్య మేనమాములు ఒక పెండింగ్ లో ఉన్న పొలాన్ని చూపి20 లక్షల రూపాయలు తీసుకొని అడుగుతున్నందుకు ఇవ్వకపోగా నీ పైన పోలీస్ కేసు పెడతాం అంటూ బెదిరిస్తూ వరకట్న వేధింపు కంప్లైంట్ ఇస్తామని మీడియా ముందు పరువు తీస్తామని, పగడ్బందీ ప్రకారమే కంప్లైంట్ ఇస్తాము అని మీడియా ముందుకు రావడం గొడవ కారణం. చప్పిడి రాజేంద్రప్రసాద్ అకౌంట్ నెంబర్ 34984784651 కి నా కుమారుడు 20లక్షల రూపాయలు పంపించినట్లు నా కుమారుడు స్టేట్మెంట్ ఇవ్వడం జరిగింది. మమ్మల్ని మోసం చేసి మా దగ్గర 20 లక్షలు తీసుకొని నా కుమారుని మోసం చేసి అనుకున్నది ఏదీ చెల్లించకుండా ఇది వరకట్నం వేధింపు తప్పుడు ప్రచారం చేయటం మే కాకుండాదాన్ని కొంతమంది మీడియా వారు కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి రాయడం ఎంతవరకి భావ్యం. మేము రికార్డెడ్ గా పంపించిన ప్రతి ఒక్క పేపర్ను ప్రజాస్వామ్యం బద్దంగాపత్రికలకు,సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అందరికీ తెలియజేయాలని పత్రికా సమావేశం ఏర్పాటు చేశామన్నారు.



## ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు కూటమి లక్ష్యం

**పెడన, మేజర్ న్యూస్:** గత వైసిపి ప్రభుత్వం వల్ల రాష్ట్ర రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాంగానే వాటి అభివృద్ధి పనులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారని నియోజవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలో గల 20వ వార్డులో బూరగడ్డ వేదవ్యాస్, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాగితం మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు తప్పక అందుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో దూసుకుపోవటానికి ఓరవ లేక కొంతమంది వైసీపీ నాయకులు తమపై దాడులు చేస్తున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు పోలీసు వారు హెచ్చరించి వెళ్లిపోమని చెప్పినా మరల తిరిగి వచ్చి జడ్పీ చైర్మన్ తనపై దాడి చేశార అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అనంతరం వేదవ్యాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ ఆగస్టు 15న మహిళలకు ఉచిత బసు సర్వీసును కూడా ప్రారంభిస్తామన్నారు. వైసిపి హయాంలో రాష్ట్ర రాజధాని ఏది ఏంటి చెప్పుకోలేని పరిస్థితి ఉండేదని నేడు అమరావతిని ఒక సింగపూర్ లా తయారు చేస్తున్నాడు మన ముఖ్యమంత్రి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలరావు, కౌన్సిల్ సభ్యురాలు కొసనం కరుణకుమారి, పరస జితేంద్ర,కమ్మగంటి వెంకటేశ్వరరావు( బాబు ), వీణం శ్రీనివాస్, గుల్లంకి మాధవరావు, అజయ్, కిషోర్ తదితరులు ఉన్నారు.

## అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాం చారమ్మ అమ్మవారు శుక్రవారం శాకాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరిగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వర్ణ సు బ్రహ్మణ్యం, కోటేశ్వరరావులు అమ్మవారికి పూజలు చేయగా, ఆలయ కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, సుబ్బారావు, మోదుమూడి కుటుంబరావు, శ్రీనివాసరావు, కనగాల రాధాకృష్ణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు అలంకరణలో పాల్గొని శ్రీలక్ష్మీనాంచారమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

## గుంటుపల్లిలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు పర్యటన



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం పర్యటించారు. స్థానిక నాయకులు ప్రజలతో మమేకమై పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుంటుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.05 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.గుంటుపల్లి గ్రామపంచాయతీకి అప్పటి రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్ మంజూరు చేసిన రూ.6.40 లక్షల నిధులతో కొనుగోలు చేసిన ట్రాక్టర్ను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రారంభించారు.గుంటుపల్లి గ్రామంలో అంతిమయాత్ర కోసం దాత చెరుకూరి శంకర్రావు రూ.17 లక్షల విలువైన మహాప్రస్థానం వ్యానును వితరణ గావించారు. దీన్ని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పరిశీలించి, దాతను అభినందించారు.అలాగే మహాప్రస్థానం వ్యానును ఉంచేందుకు ఇదే గ్రామానికి చెందిన మరో దాత చెరుకూరి వెంకటరాయుడు వితరణతో రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. దాతలను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ దాతలు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛాంధ్ర సాధనకు వేమవరం నడుం బిగించాలి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జూలై 18 :** గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం పంచాయతీని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్ సందర్శించారు. డిప్యూటీ ఎంపిడిఓ ఎజెఎల్ నరసింహారావుతో కలసి వేమవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి రోజువారీ తడిచెత్త, పొడిచెత్త సేకరణ, మంచినీటి క్లోరినేషన్, సరఫరా తీరుతెన్నులు పరిశీలించి, సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నిషేధం పై గ్రామస్తులతో చర్చించి, స్వచ్ఛాంధ్ర సాధనకు వేమవరం వాసులు సహకరించాలని ఎంపిడిఓ ఇమ్రాన్ కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## అభయాంజనేయ స్వామికి జర్నలిస్టుల పూజలు.

**గన్నవరం (హనుమాన్ జంక్షన్), జూలై 18, మేజర్ న్యూస్ :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు వెళుతున్న సందర్భంగా జంక్షన్ లో జర్నలిస్టులు అభయాంజనేయ స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఏపీయూడబ్ల్యూజే నాయకులు అట్లూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయడానికి రాజశేఖర్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ జర్నలిస్టు శనివారం ఉదయం ఢిల్లీ బయలు దేరి వెళుతున్నారు. ఈ నేపద్యంలో స్వామివారి ఆశీస్సులు కోరుకుంటూ పూజలు నిర్వహించినట్లు అట్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, పల్లెపు అంకమ్మ బాబు, గోవాడ సునీల్, ఇంటి దేవ సహాయం, దరావత్ హరికృష్ణ, కొమ్మూరి పవన్, భాగ్యరాజు, కోట సురేష్, వల్లూరి చక్రవర్తి, దాసరి చెంచు కృష్ణ, నల్లగంచు రామకృష్ణ, కిషోర్, దరావత్ రాజగోపాల్, నేమాల శ్రీధర్, ఆకుల లక్ష్మి శ్రీను, కత్తుల రమేష్, లంక రమేష్, మలిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## చోరగుడిలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**పమిడిముక్కల జులై 18 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రగతి పథంలో పామర్రు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష చేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను శాఖల వారీగా ఆయన సమీక్షించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే అందరి సమిష్టి కృషి అవసరమనే విషయాన్ని గుర్తించాలని కోరారు. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలన్నారు. అవసరమైతే తన దృష్టికి సమస్యలు తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణకుమారి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు పిఎసిఎస్ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకుడు నున్న ప్రసాద్, తహసిల్దార్ నవీన్ కుమార్, ఎండిఓ వీర్ల సీతారామరాజు, ఎంఈఓ ఐ.పద్మరాణి లతోపాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రజల నుండి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించారు.

## శాకాంబరి దేవి అమ్మవారిగా బక్తులకు దర్శనమిచ్చిన కొలువైన కనకదుర్గాదేవి



**నాగాయలంక జూలై 18 మేజర్ న్యూస్ :** మండలము గణిపేశ్వరము గ్రామములోన కొలువైన కనకదుర్గాదేవి దేవస్థానములో అమ్మవారిని గణిపేశ్వరము బర్రంకుల తలగడదీవి గ్రామ మహిళ భక్తులు కనకదుర్గాదేవి అమ్మవారిని కూరగాయలు పండ్లు వీవిద పరిమళ ద్రవ్యాలతో శాకాంబరి దేవి గా అలంకరించి పూజాది కార్యక్రమాలు వైభోగముగా అమ్మవారిని ప్రార్థించుచూ పాడి పంటలు సిరిసంపదలు వర్షాలు కురిచి ప్రజలు అందరు సుఖ సంతోషాలు కలగజేయమని అమ్మవారిని బక్తి పారవశ్యముతో పూజలు జరిపించినారు. కార్యక్రమములో పిరాటి శ్రీనివాసరావు బక్త సమాజం అమ్మవారి బక్తులు గ్రామస్తులు వైభోగము గా జరిపించినారు.

# క్వాంటమ్ వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్తు










## రాష్ట్రంతో పాటు దేశ ముఖచిత్రమే మారబోతోంది

## స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్‌లకు యువతే రథసారథులు

## ఉద్యోగాలతో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకూ ప్రభుత్వం కృషి

## ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కింద నైపుణ్య శిక్షణకు పెద్దపీట

## విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 18, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపమైన క్వాంటమ్ వ్యాలీతో రాష్ట్రంతో పాటు దేశ ముఖచిత్రమే మారబోతోందని, దీంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో మెగా జాబ్ మేళాను ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. జాబ్‌మేళాలో 35కుపైగా సంస్థలు పాల్గొన్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలతో ఉద్యోగాలు ఇచ్చేందుకు సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగావకాశాల కల్పనతో పాటు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రిమకవేత్త కావాలనే ఉద్దేశంతో ఎస్ఈఈడీఏపీ ద్వారా పెద్దఎత్తున నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తూ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించారు. గౌరవ ప్రధానమంత్రి పిలుపునిచ్చిన వికసిత్ భారత్, గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలోని స్వర్ణాంధ్రకు యువతే రథసారథులు అని, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతిఒక్కరూ ఎంటర్‌ప్రెన్యూర్ దిశగా అడుగులేయాలని సూచించారు. విజయవాడ అంటేనే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌నకు మారు పేరని, ట్రేడ్ సిటీగా పేరుందని.. ఇక్కడి నుంచే ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. రూ. 500తో ఓ చిన్న ఉద్యోగిగా కెరీర్ ప్రారంభించి, స్వయంకృషితో ఎంటర్‌ప్రెన్యూర్‌గా, రాజకీయ నేతగా ఎదిగిన శాసనసభ్యులు, గద్దెరామ్మోహన్, ఓ రైతు కుటుంబంలో జన్మించి ఐఏఎస్‌గా ఎదిగిన మన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వంటివారిని స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని సూచించారు. జాబ్ మేళాలో ప్రతిఒక్కరికీ ఉద్యోగం రావాలని కోరుకుంటున్నానని.. ఒకవేళ ఏదైనా కారణంతో ఉద్యోగం రాకపోయినా, నిరుత్సాహపడకుండా కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి కీలక నైపుణ్యాలు పరంగా సరిదిద్దుకొని కొత్త ఉత్సాహంతో తర్వాతి ఇంటర్వ్యూలకు, జాబ్ మేళాలకు హాజరుకావాలని సూచించారు. ఇందుకు తన సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు.

**వైబ్రెంట్ విజయవాడలో ప్రతిభకు కొదవలేదు : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

వైబ్రెంట్ విజయవాలో ప్రతిభకు కొదవలేదని.. అవకాశాలను అందిపుచ్చుకొని యువత కెరీర్ పరంగా ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి యువతకు ఉద్యోగావకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించిం దన్నారు. ఇంతమంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన కేశినేని ఫౌండేషన్‌కు, హాజరైన సంస్థలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోనూ ఎన్‌టీఆర్ వికాస ద్వారా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నామని, నిరుద్యోగులు ఎప్పుడైనా ఇక్కడివచ్చి రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ జాబ్ మేళాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యం: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు**

రాష్ట్రంలో అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనను రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకొందని, ఈ లక్ష్య సాధనకు వివిధ రకాల పాలసీలు తీసుకురావడం జరిగిందని శాసనసభ్యులు గద్దె రామ్మోహన్‌రావు అన్నారు. ప్రభుత్వ విధానాలతో రూ. లక్షల కోట్ల పెట్టుబడులతో పెద్దపెద్ద కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోనూ ఎప్పటికప్పుడు జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతోందని, యువత మంచి ఉద్యోగాలు పొందేందుకు జాబ్ మేళాలు మంచి వేదికలని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించనున్నామని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు రామ్మోహన్‌రావు తెలిపారు.

పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం.రమేష్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాకు కళాశాల వేదిక అయినందుకు చాలా ఆనందంగా ఉందని, విద్యార్థులు అకడమిక్ నైపుణ్యాలతో పాటు జాబ్ నైపుణ్యాలు కూడా సముపార్జించుకోవాలని.. అప్పుడే నచ్చిన కొలువు సొంతమవుతుందని సూచించారు. ఈ రోజు జాబ్ మేళాకు 1128 మంది అటెండ్ అయ్యారు,197 మంది సెలెక్ట్ అయ్యారు అలాగే 466 మంది రెండో రౌండ్ ఇంటర్వ్యూ కి షార్ట్ లిస్ట్ అయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సీహెచ్ ఉషారాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా ఉపాధికల్పన అధికారి సీహెచ్ మధుభూషన్‌రావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్వాంటమ్ వ్యాలీతో యువతకు ఉజ్వల భవిష్యత్తు







## నగరవాసులను ఆకర్షిస్తున్న వస్త్రాలు

## దేశంలోని వివిధ ప్రాంతాల వస్త్ర సాంప్రదాయం... నగరంలో ఆవిష్కృతం...

## ఆదివారంతో ముగియనున్న ఎక్స్పో

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతీయ సాంప్రదాయ వస్త్రాల వైభవం నగరవాసులను అలరిస్తోంది. బందరు రోడ్డులోని ఏ వన్ కన్వెన్షన్ సెంటర్లో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్పోలో దేశంలోనే వివిధ ప్రాంతాల సంప్రదాయాలను ఇష్టపడే మహిళలకు చక్కని అనుభూతిని కలిగిస్తోంది. 14 రాష్ట్రాల నుంచి హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అత్యద్భుతమైన డిజైన్లతో ఈ ప్రదర్శన చేస్తోంది. భారతదేశంలోని ప్రతి రాష్ట్రానికి వస్త్ర తయారీలో ఒక ప్రత్యేకమైన శైలి ఉంది.భారతదేశం అనేది హస్త తంత్రం (హ్యాండ్లూమ్) రంగానికి తల్లి వంటి దేశం. మనదేశంలో ప్రతి రాష్ట్రానికీ తనకంటూ ప్రత్యేకమైన కాటన్, సిల్క్ వస్త్ర సంప్రదాయాలు ఉన్నాయి. ఈ వస్త్రాల్లో ప్రతి చుక్క కూడా ఒక కళాఖండమే. వీటి వెనుక ఉన్న శ్రమ, శైలీ, సంస్కృతి మన సంప్రదాయాల సాక్ష్యంగా నిలుస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ లోని ఉపాడ, ధర్మవరం వస్త్రాలకు తెలుగునాట వివాహాల్ని అలంకరించే ఈ శుభ వస్త్రం అనే పేరు ఉంది. మెత్తనైన మట్టిసిల్క్‌తో తయారవుతుంది. మృదువైన గోధుమరంగు ఆధారంగా ప్రకృతి రంగులతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ధర్మవరం సిల్క్ తో మందమైన రేశంతో రూపొందించే ఈ పట్టు చీరలు, పల్లూల్లో బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేకత పొందాయి. తమిళనాడు కాంచీ పట్టుభారతదేశపు అత్యంత ఖ్యాతిగాంచిన పట్టు చీరల్లో ఒకటి. బంగారు జరీ బోర్డర్‌లు, దేవతా ఆలయాల ప్రేరణతో రూపొందే బుటా డిజైన్లు దీన్ని అత్యంత విలాసవంతంగా తీర్చిదిద్దుతాయి.కర్ణాటక రాష్ట్రం మైసూర్ సిల్క్ వస్త్రాలకు ఉండే ప్రత్యేకత మహిళా మణులందరికీ తెలుసు.మృదువైన తేనెరంగు నేపథ్యంతో, సున్నితమైన నూలుతో తయారయ్యే మైసూర్ సిల్క్ చీరలు చాలా తేలికగా ఉండి, సంప్రదాయ-ఆధునిక రూపాల్లో అందుబా టులో ఉంటాయి. మన పురుగునే ఉన్న మరో తెలుగు రాష్ట్రం తెలంగాణ ప్రాంతంలోని గద్వాల్, పోచంపల్లి వస్త్రాలు కూడా శరీరం కాటన్, పట్టు బోర్డర్‌ల మేళవింపుతో ఆలయాలలో దేవతలకు సమర్పించే వస్త్రంగా వీటికి ప్రత్యేక స్థానం ఉంది. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు దేశవ్యాప్తంగా మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయి. డై-అండ్-వీవ్ పద్ధతిలో రంగుల మేళవింపుతో రూపొందే ఈ చీరలు దేశవ్యాప్తంగా పేరుగాంచాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి - బాలుచరి, తాంతి సిల్క్ వస్త్రాలు పురాణ గాథలను డిజైన్‌ల రూపంలో చీరపై అద్దే ఈ చీరలు కళా వైభవానికి ప్రతీక. ఇదే రాష్ట్రంలోని హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్నతాంతి సిల్క్ వస్త్రాలు తేలికపాటి, గోధుమ రంగులో ఉండే ఈ చీరలు వేసవి కాలానికి చక్కటి ఎంపికగా మహిళలు భావిస్తుంటారు. ఒడిశా రాష్ట్రంలోని సంభల్పురి ఇక్కత్ సైతంసున్నితమైన చిత్తడితో, జ్యామితీయ ఆకారాల కలయికతో ప్రసిద్ధమైన ఈ చీరలు గర్భితమైన సాంప్రదాయాన్ని చాటుతాయి.ఉత్తర దేశంలోని బెనారసీ సిల్క్ వారణాసిలో తయారయ్యే బెనారసీ చీరలు రాజసంగా, శ్రీవిభవంగా ఉంటాయి. పెళ్లిళ్లకు ఆవశ్యకమైన అగ్రగణ్య వస్త్రాలివి. ఇటువంటి అద్భుతమైన వస్త్రాలు నగరవాసులకు అందుబాటులోకి రావడం నగర పేరు ప్రతిష్టలు జాతీయస్థాయిలో ఇనుమడింప చేస్తాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నూకల మధుకర్ అన్నారు. శుక్రవారం ఈ ఎక్స్ పోను ఆయన సందర్శించి ఎక్స్పోలో ఉన్న స్టాల్స్ లో వస్త్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూహస్తతంత్ర వస్త్రాలు కేవలం దుస్తులు మాత్రమే కావని, అవి మన సంస్కృతికి, చరిత్రకు, మహిళల కళాసక్తికి ప్రతిరూపాలన్నారు. స్థానిక కార్మికుల కృషిని గుర్తించి, ఇలాంటి వస్త్రాలను మద్దతు ఇవ్వడం మన బాధ్యత అని పేర్కొన్నారు. ఎక్స్పో ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ మరొక మూడు రోజులపాటు ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనకు నగరవాసులు పెద్ద సంఖ్యలో రావడం భారతీయ సాంప్రదాయ వస్త్రాలపై మహిళలకు ఉన్న మక్కువను తెలియజేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సిల్క్ మార్క్ ఉత్పత్తులను మాత్రమే ఇక్కడ విక్రయిస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాలను సందర్శించి వస్త్రాలు కొనుగోలు చేయాలనుకునే ప్రతి ఒక్కరికి ఈ ప్రదర్శన వస్త్ర కొనుగోలుకు దోహదపడుతుందన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999